కేసుల విచారణలో జాప్యం వద్దు

నేర సమీక్షలో భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్, జనవరి 28 : కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడేలా చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని, పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, విజబుల్ పోలీసింగ్ నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. దొంగతనం కేసుల్లో అధునాతన సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తు రికవరీ చేసి బాధితులకు అందేలా చూడాలన్నారు. సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్) ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, వర్టికల్ డీఎస్పీ నారాయణ నాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కెనాల్స్ కోసం సర్వే..

సర్వే చేస్తున్న అధికారులు

కాటారం, జనవరి 28 : మండలంలోని ఆదివారంపేట, గుమ్మళ్లపల్లి జీపీల పరిధిలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా స్టేజ్-2 పంప్ హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేసే మెయిన్, చిన్న కెనాల్స్ నిర్మాణం కోసం అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ డీఐ గంగాధర్ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ వినయ్, ఇరిగేషన్ జేఈ వెంకన్న పలువురు రైతులకు చెందిన 45ఎకరాల మేర కెనాల్స్ అలైన్మెంట్ కోసం భూములను సర్వే చేశారు. కాగా, గతంలో ఆదివారంపేట చెరువును రిజర్వాయర్‌గా మారుస్తూ కట్టను వెడల్పు చేసే ప్రక్రియ, పైప్ లైన్ నిర్మాణం కోసం భూములను సేకరించగా 30 మంది రైతులకు 10 మందికి పరిహారం రాలేదని సర్వే పనులను అడ్డగించడానికి రైతులు యత్నించారు. కాటారం ఎస్సై అభినవ్ నేతృత్వంలో పోలీసులు వారితో మాట్లాడారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, పరిహారం అందకుంటే మంజూరు చేయిస్తారని నచ్చజెప్పారు. పరిహారం రాకుంటే పనులు జరుగనివ్వమని వారు తేల్చిచెప్పారు.

సోలార్ విద్యుత్‌ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన

వాజేడు : ప్రభుత్వస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వాజేడు, జనవరి 28 : పీఎం కుసుమ్ పథకం కింద మంజూరైన సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం మంగళవారం మండలంలోని ఐటీఐ కళాశాల సమీపంలో పూసూరు ప్యాచ్(1) సర్వే నంబర్ 11లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి ట్రాన్స్‌కో, రెడ్‌కో అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సోలార్ విద్యుత్‌ప్లాంట్ నిర్మాణం కోసం పది ఎకరాల స్థలాన్ని గుర్తించి సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్లాంట్ నిర్మాణమైతే దీని ద్వారా సోలార్ విద్యుత్ వినియోగంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ములుగు ట్రాన్స్‌కో డీఈఈ పులుసం నాగేశ్వరరావు, రెడ్‌కో ఏఈఈ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి, రెవెన్యూ, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

మంగపేటలో..

మంగపేట : పీఎం కుసుం పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం రెడ్కో సంస్థ మేనేజర్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ తోట రవీందర్, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్ బృందం మంగళవారం మల్లూరులో పర్యటించింది. హరిత హోటల్ వెనుక ఉన్న 348 సర్వే నంబర్‌కు చెందిన భూమిని పరిశీలించారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాలోని అన్ని మండలాల్లో 135ఎకరాలు గుర్తించినట్లు సంస్థ మేనేజర్ తెలిపారు. వారి వెంట డీఈ నాగేశ్వర్‌రావు, డీపీఎం వేణుగోపాల్, సర్వేయర్ సఫియా ఉన్నారు.

మినీ మేడారం జాతరకు ఏర్పాట్లు చేయాలి

- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్ టీఎస్ దివాకర

జంపన్నవాగు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

తాడ్వాయి, జనవరి 28 : మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. ఫిబ్రవరి 12నుంచి 15వరకు జరిగే మేడారం సమ్మక్క,సారలమ్మల మినీ జాతర సందర్భంగా జాతర పరిసరాల్లో భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను ఆయన మంగళవారం పరిశీలించారు. జంపన్నవాగు వద్ద గల స్నాన ఘట్టాలపై ఐబీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బ్యాటరీ ఆప్ ట్యాప్స్, మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేస్తున్న చాటు గదులను పరిశీలించారు. ముందస్తుగా అమ్మవార్ల దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పీఆర్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను, జంపన్నవాగు లో భక్తులు స్నానాలు చేసేందుకు నీరు నిలిచేలా ఐబీ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గద్దెల పరిసరాల్లో పర్యటించి భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న బారీకేడ్‌లు, భక్తుల వాహనాలు పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకుని తిరుగ ప్రయాణం అయ్యేలా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

బీఆర్ఎస్ నాయకుడు సిరికొండ ప్రశాంత్

కృష్ణకాలనీ, జనవరి 28 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బీఆర్ఎస్ నాయకుడు, క్రీడాస్వాగత్ సమితి అధ్యక్షుడు సిరికొండ ప్రశాంత్ అన్నారు. మంగళవారం అంబేద్కర్ క్రీడా మైదానంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భూపాలపల్లి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించగా ఆయన హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యసాధన చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని తెలిపారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు, ఏబీవీపీ సమన్వయ కార్యకర్త హర్షవర్ధన్, ఎస్‌జీఎఫ్ క్రీడల జిల్లా కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

త్రిష ప్రపంచ రికార్డు సాధించడం అభినందనీయం

వెంకటాపురం(నూగూరు), జనవరి 28 : ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం నియోజకవర్గానికి చెందిన గొంగడి త్రిష క్రికెట్‌లో అండర్-19 విభాగంలో 53బంతుల్లో సెంచరీ సాధించి ప్రపంచ రికార్డు సాధించడం అభినందనీయమని వెంకటాపురం మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప రాంబాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారత జట్టులో ఆమెకు సముచిత స్థానం కల్పించి ఆమెను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు.

గణిత శాస్త్రం టీచింగ్ పోస్ట్‌కు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, జనవరి 28 : భూపాలపల్లి మైనార్టీ గురుకుల (బాలుర) పాఠశాలలో ఖాళీగా ఉన్న గణిత శాస్త్రం టీచింగ్ పోస్ట్ భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టీ శైలజ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. బీఎస్సీ (మ్యాథ్స్) బీఈడీ అభ్యర్థులు జనవరి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని టీఎంఆర్ఈఐఎస్ సొసైటీ ఆధ్వర్యంలో డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు భూపాలపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల (పాత కలెక్టరేట్) లో సంప్రదించాలని ఆమె సూచించారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

మహదేవపూర్ (కాళేశ్వరం), జనవరి 28 : మండలంలో జనవరి 1 లోపు కొత్తగా పట్టా పాస్ బుక్ పొంది అర్హత ఉన్న రైతులు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో సుప్రజ్యోతి, కాళేశ్వరం, మహదేవపూర్, సూరారం క్లస్టర్ల ఏఈవోలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టా పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భూముల వివరాలు పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలి

వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీపాల్

కాటారం, జనవరి 28 : రైతు భరోసా పథకం కోసం చేపట్టిన సాగుకు యోగ్యంకాని భూముల సర్వే వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మహదేవపూర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీపాల్ అన్నారు. మంగళవారం రైతు వేదికలో కాటారం, మహాముత్తారం మండలాలకు చెందిన మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాటారం డివిజన్‌లోని ఐదు మండలాల పరిధిలో 198 ఎకరాల మేర భూములు సాగుకు యోగ్యంగా లేనట్లు గుర్తించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కాటారం మండలంలో 118 ఎకరాలుండగా, పలిమెల మండల పరిధిలో సాగుకు యోగ్యంగా లేని భూములు లేవన్నారు. సమావేశంలో ఏవోలు పూర్ణిమ, అనూష, ఏఈవోలు పాల్గొన్నారు.

3కే రన్ విజేతలకు సన్మానం

విజేతలకు షూస్ అందజేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

తాడ్వాయి, జనవరి 28 : రోడ్డు వారోత్సవాలను పురస్కరించుకుని ఎస్పీ శబరీష్ ఆధ్వర్యంలో ములుగు పట్టణంలో జరిగిన 3కే రన్‌లో విజేతలుగా నిలిచిన మండలంలోని కాల్వపల్లికి చెందిన కుర్సం రవి, గోనెపల్లికి చెందిన తెల్లం ప్రియాంకలను ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సన్మానించారు. జిల్లాలో తాడ్వాయి మండలం పేరును నిలబెట్టిన విజేతలను మేడారంలోని కమాన్ కంట్రోల్ రూంలో కలిశారు. ఈ సందర్భంగా విజేతలకు సుమారు రూ.30వేల విలువైన అడిడాస్ షూస్‌ను వారికి అందించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సైతోపాటు హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ రమేశ్ ఉన్నారు.

అనుమానితులకు ఆశ్రయం కల్పించవద్దు

గొత్తికోయగూడాలకు వచ్చే అనుమానితులకు ఆశ్రయం కల్పించవద్దని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని అన్నారం గుత్తికోయగుడెంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎవరైనా వచ్చారా అని ఆరా తీశారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలన్నారు. కొత్త వ్యక్తులు గూడేలకు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

రహదారి భద్రత సమష్టి బాధ్యత

భూపాలపల్లి ఎంవీఐ సంధాని

గణపురం, జనవరి 28 : ప్రమాదాల నివారణకు ఆర్టీఏ నిబంధనలు పాటించాలని, రహదారి భద్రత సమష్టి బాధ్యత అని జిల్లా రవాణా శాఖ అధికారి సంధాని అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని చెల్పూర్ కేటీపీపీ ప్రధాన గేటు ఎదుట ఉద్యోగులు, కార్మికులకు రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడుపొద్దని, ఓవర్ స్పీడ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఓవర్ టేకింగ్ చేయొద్దన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని, వాహన్ను అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో కేటీపీపీ సెక్యూరిటీ విభాగం ఇన్‌చార్జి రఘుపతి, అసిస్టెంట్ మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్లు సుందర్‌లాల్, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రఫీ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఏవైఎస్ నాయకులు

చిట్యాల, జనవరి 28 : అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. భారత రాజ్యాంగానికి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సర్వమానవ సమానత్వాన్ని సహేతుకంగా నిరూపించిన సమతావాది అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏవైఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, సాంస్కృతిక కార్యదర్శి జన్నె యుగేందర్, పాముకుంట్ల తిరుపతి, మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొడ్డె శంకర్, నాయకులు పుల్ల ప్రతాప్, పాముకుంట్ల చందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణతకు కృషి చేయాలి

ములుగురూరల్, జనవరి 28 : మార్చి నెలలో జరిగే 10వ తరగతి వార్షిక పరీక్షలో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీసీఈబీ కార్యదర్శి ఈ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో 40రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముద్రించిన బుక్‌లెట్లను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. వచ్చే నెల 17వ తేదీ నుంచి పూర్తి సిలబస్ వార్షిక పరీక్షల మాదిరిలో గ్రాండ్ టెస్ట్‌లను విద్యార్థులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఒక గంటపాటు అదనంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉదయం వేళలో వెక్ అప్ కాల్స్ చేయాలని అన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

ములుగురూరల్, జనవరి 28 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ పద్మశ్రీ అవార్డును అందుకోవడాన్ని హర్షిస్తూ ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 30 ఏళ్ల సామాజిక ఉద్యమం కోసం పట్టువదలని విక్రమార్కుడని అన్నారు. పద్మశ్రీ అవార్డును ఆయనకు ప్రకటించినందుకు కేంద్ర ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రిటైర్డ్ భవన్‌లో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు..వెయ్యి గొంతుకల మహా ప్రదర్శనను విజయవంతం చేసేందుకు సమావేశం నిర్వహించారు. మాదిగలు డప్పుతో తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు కోతి కార్తీక్, శ్యామ్‌బాబు, స్వామి, రవీందర్, రాంబాబు, సురేశ్, జాషువా, సురేందర్, భద్రయ్య,మొగిలి,నరేశ్ పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో..

వెంకటాపూర్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డుపై ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యామ్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

'న్యాయం జరిగే వరకూ ఆందోళన చేపడుతాం'

వెంకటాపురం(నూగూరు), జనవరి 28 : ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తామని, తమకు న్యాయం జరిగే వరకు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తామని జాతీయ మాలమహానాడు జిల్లా కన్వీనర్ తోటమల్ల రమణమూర్తి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాలలు తమ హక్కుల కోసం ఏకమై పోరాడాలని అన్నారు. అనంతరం మాలమహానాడు మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మందాల బూషనం, కాలువ సుందర్‌రావు, సాధనపల్లి శ్రీను, గుండమల్ల కిరణ్, లక్కుమల్ల మోహన్, ఆదినారాయణ, గణపతి, గద్దల రవి, కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను చేరుకోవాలి

తాడ్వాయి, జనవరి 28 : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను చేరుకునేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మంగళవారం ప్రసవించిన బాలింతతో మాట్లాడి అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని, ఇక్కడ సాధ్యం కాని ప్రసవాలను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ప్రసవాలను చేయడంలో ముందున్న ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని వైద్యధికారి చిరంజీవికి సూచించారు.

కంటెయినర్ ఉపకేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

కన్నాయిగూడెం, జనవరి 28 : మండలంలోని ఐలాపూర్‌లో జరిగే సమ్మక్క-సారలమ్మల జాతరకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు కంటెయినర్ ఉప కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన ఐలాపూర్ చేరుకొని వైద్యాధికారి అభినవ్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్యతో కలిసి వన దేవతలను దర్శించుకున్నారు. కంటెయినర్ ఉపకేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధి కొండాయి, చినబోయిన పల్లి ఆయుస్మాన్ ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించారు. ఓపీకి వచ్చే రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీసి రిజిస్టర్లు, మందుల నిల్వలు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రణీత్, అన్మిషా, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డు మంజూరు చేయాలి

కృష్ణ కాలనీ, జనవరి 28: తన కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేయాలని భూపాలపల్లి మండలం నేరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హర్షం రాజు అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో తన కుటుంబానికి రేషన్ కార్డు కావాలని దరఖాస్తు చేసుకున్నానన్నారు. అధికారులు సర్వే చేసి గ్రామ సభలో రేషన్ కార్డుల అర్హుల జాబితాను చదివి వినిపించగా, లిస్టులో తన పేరు వచ్చిందన్నారు. ఆ సమయంలో ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు రీ ఎంక్వయిరీ చేసి, తనకు ట్రాక్టర్ ఉందని, వివక్షపూరితంగా అర్హుల జాబితా నుంచి పేరు తొలగించి అనర్హులను ఎంపిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ తనది కాదని తన అమ్మ పేరు మీద ఉందని చెప్పినప్పటికీ గ్రామ కార్యదర్శి వినిపించుకోలేదన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో స్పందించి తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న గ్రామ కార్యదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తనకు రేషన్‌కార్డు మంజూరు చేయాలని రాజు కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మొగుళ్లపల్లి, జనవరి 28 : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గుడిపహాడ్‌లో జరిగింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాశం సదయ్య (40) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో భార్య మందలించింది. దీనిని మనసులో పెట్టుకున్న సదయ్య సోమవారం పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, పనికి వెళ్లకుండా మద్యం మత్తులో బంగ్లపల్లి శివారులోని మొక్కజొన్న చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పాశం సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

ములుగురూరల్, జనవరి 28 : ములుగు జిల్లా కేంద్రంలో నేడు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సరఫరాలో కోతలు విధిస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బండారుపల్లిరోడ్డు, శాంతి స్తూపం, కలెక్టరేట్ కార్యాలయం ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తమిళ నాడు జూబ్లీ డైమండ్ జంబోరికి 36మంది స్కౌట్స్‌అండ్‌గైడ్స్

ఏటూరునాగారం, జనవరి 28 : తమిళనాడులో ఫిబ్రవరి 3వరకు నిర్వహించే భారత్ స్కౌట్స్‌అండ్‌గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 36మంది ఎంపికైనట్లు స్కౌట్స్‌అండ్‌గైడ్స్ ఆఫీసర్ గోపాల్ తెలిపారు. మంగళవారం నుంచి జంబోరి ప్రారంభమైనట్లు తెలిపారు. 36మంది స్కౌట్స్‌అండ్‌గైడ్స్ ఇందులో ఐటీడీఏ నుంచి పాల్గొంటారని తెలిపారు. ఐటీడీఏ ద్వారా వీరికి నిధులు సమకూర్చారు.

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ములుగురూరల్, జనవరి 28 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చీఫ్‌లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ పాల్గొని మోటార్ వెహికిల్ చట్టం, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మికుల చట్టంపై ఉచిత న్యాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిచర్ల ఓసీపీలో ధ్యానోత్సవం

మల్హార్, జనవరి 28 : తాడిచర్ల ఓసీపీలో మంగళవారం ధ్యానోత్సవాన్ని ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్‌రెడ్డి టీచర్ వెంకటరమణతో కలిసి ప్రారంభించారు. శారీరక, మానసిక, భావోద్వేగ శ్రేయస్సును ప్రోత్సహించే లక్ష్యంతో యోగా శిబిరం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు అనుభవజ్ఞులైన బోధకులు నిర్వహిస్తారన్నారు. యోగా భంగిమలు, శ్వాస పద్ధతులు, ధ్యాన అభ్యాసాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌వో సురేష్‌బాబు, డీజీఎం రవికుమార్ పాల్గొన్నారు.

క్రీడా స్థలం కేటాయించాలి

మంగపేట, జనవరి 29 : మండలంలోని 25పంచాయతీలకు చెందిన క్రీడాకారుల సౌకర్యం కోసం అనువైన క్రీడాస్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ తోట రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడాకారులు తమ ప్రాక్టీస్ కోసం అనుకూలమైన క్రీడా మైదానం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారుల సమస్యను అర్థం చేసుకొని స్థలాన్ని కేటాయించాలని పేర్కొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలను అందించాలి

ములుగురూరల్, జనవరి 28 : ప్రజలకు జాతీయ నాణ్యతాప్రమాణాలతో కూడిన వైద్య సేవలను అందించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా